క్లుప్తంగా

పోటాపోటీగా సైకిల్ పోటీలు



విజేతలతో ఎస్సై సురేశ్, ప్రజాప్రతినిధులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన సైకిల్ రేస్ పోటీలు చిన్నారుల్లో ఉత్సాహం నింపాయి. హాజీపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అండర్–15, 13, 10విభాగాల్లో పోటీలు నిర్వహించగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. అశిశ్, హర్షవర్దన్, నిఖిలేందర్, అశ్విత్‌వర్మ, చరణ్‌కుమార్, మహేందర్, అభిలాశ్, అర్మాన్, విద్యార్థినుల విభాగంలో శివకారుణ్య, ప్రజ్వల విజేతలుగా నిలిచారు. మొదటి, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, రూ.1,500ప్రోత్సాహకాలతో పాటు పతకాలను ఎస్సై అందజేశారు. మంచిర్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాసమల్ల శ్రీనివాసగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యాగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి, గుడిపేట మాజీ సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి–రాజయ్య, మాజీ ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

జైపూర్: జైపూర్ మండలం కిష్టాపూర్ సమీపంలో గల పార్వతిబ్యారేజీ వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా మహారాష్ట్ర నుంచి పెద్దపల్లి జిల్లాకు తరలిస్తున్న పశువుల వాహనాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ర్యాకెల్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన గంట రాజు అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి వాహనంలో పెద్దపల్లి జిల్లాకు జైపూర్ మండలం మీదుగా ఐదు ఆవులు, రెండు దూడలు తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజును అదుపులోకి తీసుకుని పశువులను మంచిర్యాల గోశాలకు తరలించినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామం గొల్లపల్లి గ్రామానికి చెందిన కంకణాల నాగరాజు అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన కంకణాల నాగరాజు బుధవారం ఉదయం తల్లిదండ్రులతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గొడవతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగరాజు గుర్తు తెలియని పురుగుల మందు సేవించాడు. స్థానికులు గమనించి వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. నాగరాజు ప్రస్తుతం క్షేమంగా ఉన్నాడు.

నిబంధనలు పాటించాలి



భీమారం: కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై శ్వేత

భీమారం/దండేపల్లి/జన్నారం: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని భీమారం ఎస్సై శ్వేత అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వాహనదారులకు నిబంధనల గురించి వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యంతాగి వాహనాలు నడపొద్దని సూచించారు. దండేపల్లి మండలంలోని తాళ్లపేటలో, జన్నారం మండల కేంద్రంలో సాంస్కృతి సారధి కళాకారులు రోడ్డు భద్రతపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

నాలుగు తరాల కలయిక



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలో నాలుగు తరాలకు చెందిన బత్తుల వంశంలోని పిల్లలు బుధవారం ఒకే చోట కలిశారు. బెల్లంపల్లి మండలం పాతబెల్లంపల్లి గ్రామానికి చెందిన బత్తుల వంశానికి చెందిన దివంగతులు బత్తుల రాజవ్వ–మల్లయ్యల పేరుతో కుటుంబ ఆత్మీయ సమ్మేళనానికి శ్రీకారం చుట్టారు. 86మంది కుటుంబ సభ్యులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చారు. పరిచయాలు చేసుకుంటూ రోజంతా ఆట–పాటలతో సందడిగా గడిపారు.

క్షీరాభిషేకం

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేసి 11సంవత్సరాలైన సందర్భంగా ఏరియా జీఎం దేవేందర్ మంగళవారం క్షీరాభిషేకం చేశారు.

సంక్రాంతి జోష్..!



భీమిని: వీరాపూర్‌లో గంగిరెద్దుతో విన్యాసాలు



మంచిర్యాలలో ముగ్గు వేస్తున్న యువతి



నెన్నెలలో ముగ్గులు వేస్తున్న యువతులు



భీమారం: ముగ్గు వేస్తున్న యువతి

భీమారం/బెల్లంపల్లి/దండేపల్లి/కోటపల్లి/మందమర్రిరూరల్/భీమిని/మంచిర్యాలఅర్బన్/చెన్నూర్/తాండూర్/జన్నారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి, కనుమ వేడుకలు మంగళ, బుధవారాల్లో సంబురంగా జరుపుకొన్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా వేడుకల్లో సందడి చేశారు. ఇంటి ముందు రంగవల్లులు ఆకట్టుకున్నాయి. సాంప్రదాయం ప్రకారం పేడతో గొబ్బెమ్మను చేసి పసుపు కుంకుమతో గొబ్బెమ్మకు తిలకం దిద్ది ముగ్గు మధ్యలో ఉంచారు. గొబ్బెమ్మ చుట్టూరా నవ ధాన్యాలు, గడ్డి పోచలు, చిక్కుడు కాయలు, రేగుపండ్లు, పూలు పెట్టి అలంకరించారు. ఇళ్లల్లో పిండి వంటలు ఘుమఘుమలాడాయి. పోటాపోటీగా పతంగులు ఎగురవేశారు. ఆకాశంలో ఎగిరిన గాలి పటాలు హరివిల్లును తలపించగా, ఆకాషానికి ఎగబాకిన పతంగులను చూసి యువకులు, చిన్నారులు హుషారుగా కేరింతలు కొట్టారు. కొత్తగా పెళ్లి చేసి అత్తారింటికి సాగనంపిన కూతురు, అల్లుడిని ఇంటికి ఆహ్వానించి కొత్త బట్టలు అందజేసి కట్నకానుకలు అందజేశారు. కూతుళ్లు, అల్లుళ్ల రాకతో ఇళ్లన్నీ కళకళలాడాయి. పల్లెల్లో ఇంటింటా గంగిరెద్దులు విన్యాసాలు చేస్తూ తిరిగాయి. బుధవారం కనుమ పండగలో భాగంగా మహిళలు ఒకరి ఇంటికి ఒకరు వెళ్తూ సంక్రాంతి నోముల సందర్భంగా పసుపు–కుంకుమలతో వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ముగ్గు వేస్తున్న చిన్నారులు



ముగ్గు వేస్తున్న మహిళ



జన్నారం: ముగ్గులు వేస్తున్న చిన్నారులు



భీమారంలోని రామాలయంలో...



వేమనపల్లిలో వాయినాలు ఇచ్చుకుంటూ...



కోటపల్లి: ముగ్గు వేస్తున్న మహిళలు

చర్చనీయాంశంగా బేస్‌మెంట్ కూల్చివేత

- ఎవరిని అడిగి కూల్చి వేశారంటూ కమిషనర్ ఆగ్రహం
- కలెక్టర్, సింగరేణి సీఅండ్ఎండీకి నివేదిక
- నిర్మాణ వ్యయం భరించాలని ఏరియా జీఎంకు లేఖ



రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సింగరేణి ఎస్టేట్ డిపార్ట్‌మెంట్ ఒక్కటి ఆటంకంగా నిలుస్తుందని అనుకుంటే ఇప్పుడు తాజాగా ఎస్అండ్‌పీసీ విభాగం తోడైంది. చిన్న పిల్లల ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు కోసం సాగుతున్న పునాదిని కూలగొట్టడంతో ఇప్పుడు కొత్త వివాదం నెలకొంది. తమకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, నోటీసులు కూడా జారీ చేయకుండా పునాదులు కూల్చటం ఎంతవరకు సమంజసం అని మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ఇటు సింగరేణి సీఅండ్ఎండీకి లేఖ రాసిన కమిషనర్ కూలగొట్టిన పునాదుల ఖర్చులు భరించాలని మందమర్రి ఏరియా జీఎంకు ఆగ్రహంగానే చెప్పటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎస్టేట్ విభాగానికి గాని, ఏరియా జీఎంకు గాని ఏ మాత్రం చెప్పకుండానే ఎస్అండ్‌పీసీ సిబ్బంది పునాదులు కూలగొట్టడం వెనుక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ విమర్శల పూర్తి వివరాల్లోకి వెళ్తే... క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు ఆర్‌కే4–గడ్డలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు కోసం పునాదులు నిర్మించారు. ఇందులో భాగంగానే ఆట పరికరాలు ఏర్పాటు చేయటానికి పునాదులు సైతం ఇటీవల నిర్మించారు. వాస్తవానికి ఇది ప్రభుత్వ స్థలం. గతంలో సింగరేణి సంస్థ పరిధిలో ఈ స్థలం ఉన్నప్పటికీ 2022లో ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. కాగా ఆ స్థలంలో ఓపెన్‌జిమ్‌తో పాటు చిల్డ్రన్స్ ప్లే ఏరియా ఏర్పాటు చేయటానికి మున్సిపల్ అధికారులు పూనుకున్నారు. ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంతో ఆయన పనులు మొదలుపెట్టారు. చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్ నిర్మాణ పనులు చకచకా సాగుతుండగా ఇంతలో సింగరేణికి చెందిన ఎస్అండ్‌పీసీ విభాగం సిబ్బంది వచ్చి ఆ పునాదులను పండగ రోజైన మంగళవారం కూలగొట్టడం ఇప్పుడు తాజా వివాదానికి దారితీసింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు ఈ విషయంలో ఆగ్రహంగా ఉన్నారని తెలుస్తోంది.

ఖర్చులు భరించాల్సిందే...

తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కనీసం నోటీసులు కూడా జారీ చేయకుండా చిల్డ్రన్స్ ప్లే ఏరియాకు సంబంధించిన పునాదులు కూలగొట్టడానికి సింగరేణి సంస్థ కారణమని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నారు. ఈ విషయమై కమిషనర్ ఏరియా జీఎం దేవేందర్‌తో మాట్లాడినట్లు సమాచారం. తొలుత ఎస్టేట్ విభాగం అధికారితో మాట్లడగా తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పినట్లు తెలిసింది. మరోవైపు జీఎం సైతం తనకూ ఎలాంటి సమాచారం లేదని చెప్పడం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. అంటే ఎస్టేట్ విభాగానికి, ఏరియా జీఎంకు తెలియకుండా ఎస్అండ్‌పీసీ సిబ్బంది ఇంత అత్యుత్సాహం ప్రదర్శించటం వెనుక ఆంతర్యమేమిటనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఏదేమైనా చిల్డ్రన్స్ ప్లేఏరియా పునాదులు కూలగొట్టిన ఖర్చులు తమకు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వాదిస్తున్న తరుణంలో ఈ వివాదం ఏ వైపు ఎటు వెళ్తుందనే ఆసక్తి నెలకొంది. ప్రజల సౌకర్యార్థం అది కూడా ప్రభుత్వ స్థలంలో తాత్కాలిక నిర్మాణం చేపడుతుంటే సింగరేణి అధికారులు అడ్డుకోవటం ఏమిటని స్థానికులు బాహాటంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన వారికి పరిహారం

మంచిర్యాలటౌన్: జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల–వరంగల్ –ఖమ్మం–విజయవాడ జాతీయ రహదారి 163జి సంబంధించిన భూములను కోల్పోతున్న అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో బుధవారం జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న బాధితుల వివరాలను మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

‘జయరామారావుపై దాడి అమానుషం’

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు మెట్‌పల్లి జయరామారావుపై మంచిర్యాల ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయడం అమానుషమని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. జయరామారావుపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు మంచిర్యాల పట్టణంలో దాడి చేసి గాయపర్చగా, పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు వేర్వేరుగా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూర్: సింగరేణి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోర్సుల ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి ఆర్.తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా పరిధిలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. యోగా, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులు మాదారం టౌన్‌షిప్‌లో, యోగా, బ్యూటీషియన్, డీటీపీ, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు గోలేటి టౌన్‌షిప్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 18వ తేదీలోపు జీఎం కార్యాలయం ఏటీబీ సెల్‌లో దరఖాస్తులు అందించాలని కోరారు.

గౌడకులస్తులు రాజకీయంగా ఎదగాలి

జన్నారం: గౌడ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని మోకుదెబ్బ రాష్ట్ర నాయకుడు బాలసాని శ్రీనివాసగౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ పేర్కొన్నారు. ఇటీవల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన కవ్వాల్ గ్రామానికి చెందిన గర్వందుల సత్యగౌడ్‌ను కవ్వాల్, జన్నారం గౌడ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కవ్వాల్ గౌడ సంఘం అధ్యక్షుడు పోశగౌడ్, ఉపాధ్యక్షుడు బాలగౌడ్, మోకుదెబ్బ, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రికెట్ ఆడిన గిరిజన సహకార చైర్మన్

దండేపల్లి: నిత్యం పలు కార్యక్రమాలతో బిజీగా ఉండే రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి సంక్రాంతికి దండేపల్లి మండలం తాళ్లపేటలో మంగళవారం నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొని క్రికెట్ ఆడారు. టీంకు కెప్టెన్‌గా వ్యవహరించి విజయం సాధించారు.

సంగీతంలో ఎస్టీపీపీ ఉద్యోగుల ప్రతిభ

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటుకు చెందిన ఉద్యోగులు బి.రవీంద్రకుమార్, బి.శ్రీనిధి కోల్ ఇండియా వ్యాప్తంగా నిర్వహించిన ఇంటర్ కంపెనీ కల్చరల్ మీట్ 2024–2025 పోటీలను అనుబంధ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ కంపెనీ పశ్చిమ బెంగాల్లోని అసన్ సోల్‌లో నిర్వహించిన పోటీల్లో కర్ణాటక సంగీతంలో ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి గెలుపొందారు. ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు వారికి అభినందనలు తెలిపారు.

షటిల్ టోర్నమెంట్ పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు నాయికిని సురేందర్ ఆధ్వర్యంలో ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు షటిల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొత్తం 14జట్లు పాల్గొనగా బుధవారం జరిగిన ఫైనల్ పోటీలో ముల్కల్లకు చెందిన కృష్ణమూర్తి–జక్కుల వెంకటేశ్ జట్టు మొదటి విజేతగా నిలవగా, రెండో విజేతగా మంచాల శ్రీనివాస్–పెట్టెం మల్లేశ్ జట్టు విజయం సాధించింది.

లబ్ధిదారుల ఎంపిక సర్వే పూర్తి చేయాలి

కాసిపేట: ఈ నెల 20లోపు లబ్ధిదారుల ఎంపిక సర్వేను అన్నిశాఖలు పూర్తి చేయాలని తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ, అధికారులకు, సిబ్బందికి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అవగాహన సమావేశం నిర్వహించారు.

ఫారెస్టు అధికారిని కలిసిన జీఎం

నస్పూర్: జిల్లా ఫారెస్టు అధికారి శాంతారామ్‌ని జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి ఆధ్వర్యంలో ఉన్న అటవీ భూములకు సంబంధించిన అంశాలపై శాంతారామ్‌తో చర్చించారు.

మాజీ ఎమ్మెల్యేకు సంక్రాంతి శుభాకాంక్షలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే నివాసంలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

‘శ్మశాన వాటికకు అనుమతి ఇవ్వొద్దు’

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ గ్రామ పంచాయతీలో కొత్తగా ఏర్పాటు చేయాలని చూస్తున్న శ్మశానవాటికకు ఎలాంటి అనుమతులు ఇవ్వద్దంటూ బుధవారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు స్థానిక గ్రామస్తులు విన్నవించారు. ఆర్డీవో, డీపీవో, ఎంపీడీవో, ఎంపీపీ, పంచాయతీ కార్యదర్శులకు కూడా వినతిపత్రాలు అందించారు.

తెలుగు కీర్తి ప్రతిభ పురస్కారానికి ఎంపిక

చెన్నూర్: విజయవాడ పట్టణంలో ఈ నెల 21న శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి చెన్నూర్ పట్టణానికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, కవి మేకల రామస్వామి ఎంపికయ్యారు.

కాకో సన్నిధిలో జంగు, లింగు దీక్షాపరులు

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున గల ఆదివాసీల ఆరాధ్యదైవం శ్రీపద్మల్‌పురికాకోను ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు జంగు, లింగు దీక్షాపరులు బుధవారం దర్శించుకున్నారు. హోమ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జంగుబాయి దీక్ష పీఠాధిపతి భగవంత్‌రావ్, గోండి ధర్మగురు వు బారికరావుస్వామి, జంగుబాయి చరిత్రను భక్తులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని వివరించారు. రాష్ట్రగిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ కాలనీ అయ్యప్ప సేవా సన్నిదానంలో అయ్యప్ప భక్తులు బుధవారం మకర విళక్కు పూజలు నిర్వహించారు. 30మంది భక్తులు మాల విరమణ చేసినట్లు అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సమితి సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్య

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్య బోధించనున్నట్లు తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చదివించడానికి ఆసక్తి చూపాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఏఎంసీ ఏరియా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాల్లో ఐదో తరగతితో పాటు 6నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ దూట శ్రీధర్, కాసిపేట సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు

మహాశివరాత్రి మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

బెల్లంపల్లి: ఫిబ్రవరి 26న సింగరేణి తిలక్ స్టేడియంలో జరిగే మహా శివరాత్రి వేడుకల పోస్టర్‌ను బుధవారం వాకర్స్ అసోసియేషన్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరిస్వామి, తిలక్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం రాజం, సెక్రెటరీ నాగేష్, సీనియర్ వాకర్స్‌సభ్యుడు గెల్లి జయరాం తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో సైనికుల త్యాగం వెలకట్టలేనిది

పాతమంచిర్యాల: దేశ రక్షణలో సైనికుల త్యాగం వెలకట్టలేనిదని వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఇండియన్ ఆర్మీ డే సందర్భంగా మాజీ సైనికులైన డీబీ చారి, మజీద్, రమేశ్, సత్తయ్య, సత్య, దయానంద్‌ను లయన్స్‌క్లబ్, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో సన్మానించారు.

తాండూర్: దేశ రక్షణలో జవాన్‌ల సేవలు మరువలేనివని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ వైస్ చైర్మన్ సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆర్మీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని సుభద్ర కాలనీకి చెందిన ఆర్మీ జవాన్ పుప్పాల లక్ష్మణ్‌ను, త్రిపురలో విధులు నిర్వర్తిస్తూ అకాల మృతి చెందిన మాదారం టౌన్‌షిప్‌కు చెందిన గోనే రాజేంద్రప్రసాద్ తల్లి రాజమ్మకు సన్మానం చేశారు.

భీమారం: భారత ఆర్మీ డేను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆవిడం ఎక్స్ రోడ్డు వద్ద ఆర్మీలో పనిచేస్తున్న భీమారం గ్రామానికి చెందిన ఆవుల మహేశ్, కొమ్ము రాజన్నలకు శాలువా కప్పి సన్మానం చేశారు. నిర్వాహకులు ఎల్ఐసీ ఇన్సూరెన్స్ సేవాకేంద్రం ఇన్‌చార్జి రేషవేని శ్రీనివాస్, మాజీ సైనికులు కొక్కుల శ్రీనివాస్, మహ్మద్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మీ సైనికులను సన్మానిస్తున్న యువకులు

రామగిరి ప్యాసింజర్‌లో తనిఖీలు

- అక్రమంగా తరలిస్తున్న 19.60 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

బెల్లంపల్లి: భద్రాచలం రోడ్ నుంచి బల్లార్షాకు వెళ్తున్న రామగిరి ప్యాసింజర్ రైలులో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మహారాష్ట్రకు అక్రమంగా అమ్మకానికి తీసుకెళ్తున్న రేషన్ బియ్యాన్నీ స్వాధీనం చేసుకొని, ఇద్దరు మహిళా నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగజ్‌నగర్ ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. రామగిరి ప్యాసింజర్ రైలులో రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో ఎక్కి బోగీలల్లో తనిఖీలు చేపట్టారు. అది గమనించిన బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలు రైలులోని మరుగుదొడ్లలో బియ్యం సంచులను ఉంచి లోపల తలుపులేసుకొని ఉండిపోయారు. రైలు వీరూర్ వరకు వెళ్లి ఆగినా కూడా మరుగుదొడ్డిలో నుంచి బయటకు రాలేదు. అప్పటివరకు అక్కడే మకాం వేసి ఉన్న పోలీసులు రామగిరి ప్యాసింజర్ రైలు తిరిగి భద్రాచలం రోడ్‌కు బయలు దేరాక బియ్యం రవాణా చేస్తున్న మహిళల దృష్టిని మరల్చారు. మరుగుదొడ్ల వద్ద నుంచి వెళ్లిపోయి వేరే బోగీల్లో ఉన్నారు. రామగిరి ప్యాసింజర్ రైలు రాత్రి 7–30గంటల ప్రాంతంలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే ఒక్కసారిగా ఆ మహిళలు దాక్కున్న మరుగుదొడ్ల వద్దకు వెళ్లి పట్టుకున్నారు. నిందితులు మంచిర్యాల జిల్లా రవీంద్రఖనికి చెందిన ఎం.లక్ష్మి, ఏ.రాజేశ్వరిగా గుర్తించారు. వీరి వద్ద నుంచి 55బస్తాల రేషన్ బియ్యం (19.60 క్వింటాళ్లు) స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.73వేల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు నిందితులిద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్పీఎఫ్ సీఐ వెల్లడించారు. తనిఖీల్లో రామగుండం ఆర్పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్, బెల్లంపల్లి ఏఎస్సై మోహన్‌రాథోడ్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుకున్న బియ్యం బస్తాలు, నిందితులతో పోలీసులు